నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, ఆదివారం 21 జూలై 2024 | SIDDIPET

సిద్దిపేట పట్టణంలో శనివారం రాత్రి భారీగా కురుస్తున్న వర్షం

ఎమ్మెల్యే మాణిక్‌రావుకు హరీశ్‌రావు పరామర్శ

కోహీర్, జూలై 20: అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతున్న సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావును సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శనివారం పరామర్శించారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద దవాఖానకు వెళ్లి ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో హరీశ్‌రావు మాట్లాడారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబసభ్యులకు మనోధైర్యం కల్పించారు. హరీశ్‌రావు వెంట బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ ఉన్నారు.

దవాఖానలో ఎమ్మెల్యే మాణిక్‌రావును పరామర్శిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

- ఉమ్మడి మెదక్ జిల్లాలో మోస్తరు వర్షం
- వర్షంతో పత్తి, పెసర, మినుము, కంది పంటలకు ఊపిరి
- సింగూరు ప్రాజెక్టులోకి స్వల్ప వరద

ముసురేసింది...

ముసురుతో సంగారెడ్డి పట్టణంలో గొడుగులు పట్టుకొని వెళ్తున్న విద్యార్థులు

సంగారెడ్డి జూలై 20 (నమస్తే తెలంగాణ): తుఫాన్ ప్రభావం వల్ల సంగారెడ్డి జిల్లాలో శనివారం మోస్తరు వర్షం కురిసింది. జిల్లా అంతటా రోజంతా ముసురు అలుముకుంది.ఎడతెరిపిలేకుండా వర్షపు చినుకులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో పట్టణ ప్రాంతాల్లో జనజీవనం కొంత స్తంభించింది. కొద్దిరోజులుగా జిల్లాలో వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తుఫాన్ కారణంగా రైతులు సంతోషంగా ఉన్నారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో వానకాలం పంటలకు ప్రాణం పోసినట్లు అయ్యింది. ముఖ్యంగా వర్షాలతో పత్తిపంటకు ఎక్కువ లాభం చేకూరింది. వర్షాలు లేక చాలా గ్రామాల్లో పత్తి ఎండిపోయే పరిస్థితి నెలకొన్నది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వానకాలంలో రైతులు సాగు చేసిన పత్తి, పెసర, మినుము, కంది తదితర పంటలకు లాభం జరిగింది. గుమ్మడిదల మండలంలో అత్యధికంగా వర్షం కురిసింది. గుమ్మడిదలలో 2.8 సెం.మీటర్లు, సిర్గాపూర్‌లో 2.5 సెం.మీ, రామచంద్రాపురంలో 2.2 సెం.మీ, అమీన్‌పూర్, సిర్గాపూర్, జిన్నారంలో 2.1సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. చౌటకూరు మండలంలో రెండు సెం. మీటర్ల వర్షం కురిసింది. మిగతా మండలాల్లో 1.2 సెం.మీటర్ల నుంచి 1.90 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాలు కురుస్తుండటంతో చెరువులు, కుంటల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతోంది.

సింగూరు ప్రాజెక్టులోకి 391 క్యూసెక్కులు

పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతున్నది. సోమవారం ప్రాజెక్టులోకి 391 క్యూసెక్కులు వచ్చాయి. ముఖ్యంగా సింగూరు ప్రాజెక్టు సింగూరు ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 13.596 టీఎంసీల జలాలు ఉన్నాయి.

సిద్దిపేట జిల్లాలో...

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 20: సిద్దిపేట జిల్లాలో మోస్తరు వర్షం పడింది. దుబ్బాకలో 4.6 మి.మీటర్లు , సిద్దిపేట రూరల్‌లో 3.7 మి.మీ, చిన్నకోడూరులో 5.6మి. మీ, బెజ్జంకిలో 7.5 మి.మీ, కోహెడలో 6.3మి.మీ, హుస్నాబాద్‌లో 5.7మి.మీ, అక్కన్నపేటలో 10.4 మి. మీ, నంగునూరులో 3.8మి.మీ, సిద్దిపేట అర్బన్‌లో 4.4మి.మీ, తొగుటలో 6.5మి.మీ, మిరుదొడ్డిలో 5.0 మి.మీ, దౌల్తాబాద్‌లో 6.5మి. మీ, రాయపోల్‌లో 9.5 మి.మీ, వర్గల్‌లో10.1మి.మీ, ములుగులో 8.9మి.మీ, మర్కూక్‌లో 7.7 మి.మీ, జగదేవ్‌పూర్‌లో 3.8 మి.మీ, గజ్వేల్‌లో 7.9మి.మీ, కొండపాకలో 4.0మి.మీ, కొమురవెల్లిలో 1.5మి.మీ, చేర్యాలలో 2.7మి.మీ, మద్దూర్‌లో 5.8మి.మీ, నారాయణరావుపేటలో 1.6మి.మీ, దూల్మిట్టలో 4.1మి.మీ, అక్బర్‌పేట-భూంపల్లిలో 4.6మి.మీ, కుకునూర్‌పల్లిలో 5.7మి.మీటర్లు నమోదుకాగా అత్యధికంగా అక్కన్నపేట మండలంలో 10.4 మి.మీటర్లు అత్యల్పంగా కొమురవెల్లిలో 1.5మి.మీటర్లు నమోదైంది. జిల్లాలో సగటున 5.7శాతం వర్షపాతం కురిసింది.

మెదక్ జిల్లాలో...

మెదక్, జూలై 20 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లా అంతటా శుక్రవారం ముసురు వాన కురుస్తుంది. శనివారం 10.9 మి.మీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. మాసాయిపేటలో అత్యధికంగా 29.2 మి.మీటర్ల వర్షపాతం నమోదు కాగా, అల్లాదుర్గంలో అత్యల్పంగా 3.2 మి.మీటర్ల వర్షం పడింది. చేగుంటలో 18.4 మి.మీ, చిన్నశంకరంపేటలో 17.8 మి.మీ, కొల్చారంలో 14.5 మి, మీ, మెదక్‌లో 13.3 మి,మీ, నార్సింగిలో 12.6 మి, మీ, తూప్రాన్‌లో 11.9, టేక్మాల్‌లో 11.9 మి, మీ, వెల్దుర్తిలో 11.6 మి.మీ, హవేళీఘనపూర్‌లో 11.0మి.మీటర్ల వర్షం కురిసింది.

సిద్దిపేట పట్టణంలో ముసురులో స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో వర్షానికి ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సీఎస్‌ఆర్ పనుల్లో వేగం పెంచాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 20: సమాజ అభివృద్ధి కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్ఆర్) నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సీఎస్ఆర్ నిధుల సేకరణపై అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్ఆర్ కింద జిల్లా అభివృద్ధికి నిధులు ఉపయోగించేలా చూడాలన్నారు. సీఎస్ఆర్ నిధులను విద్య, వైద్యం కోసం ఖర్చు చేస్తామన్నారు. ముఖ్యంగా హాస్టళ్లు, దవాఖానలు, అదనపు తరగతి గదులు, విద్యా సంస్థల్లో కావాల్సిన ఉపకరణాల కోసం వినియోగించేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని ఆయా పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్ఆర్ కింద ఇవ్వాల్సిన నిధులు, బకాయిలపై దృష్టి సారించాలన్నారు. ఆయా నిధులతో గుర్తించిన పనులను చేపట్టాలన్నారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో పరిశ్రమ ఉన్న ప్రాంతానికి, జిల్లాకు ప్రాధాన్యం ఇచ్చేలా క్లస్టర్ ఇన్‌చార్జి అధికారులు ప రిశ్రమల యాజమాన్యాలను చైతన్యపర్చాలన్నారు.

కోటీశ్వరులను చేసేందుకే మహిళా శక్తి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి పథకం మహిళలను కోటీశ్వరులను చేసేందుకే అని కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు 13 రకాల వివిధ యూనిట్స్‌లో సూపర్ మార్కెట్లు, ఫుడ్ ప్రాసెస్ యూనిట్స్, ఈవెంట్ మేనేజ్‌మెంట్స్, పాల కేంద్రాలు, పౌల్ట్రీ పరిశ్రమ, మొబైల్ ఫిష్ యూనిట్స్, మహిళా క్యాంటిన్స్, కస్టమ్ మైక్రో ఎంటర్‌ప్రైజెస్ వంటి పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తున్నదని వివరించారు. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి సూచనలు, సలహాలు, మార్కెటింగ్‌లో మెళకువలపై శిక్షణ ఇవ్వాలన్నారు. సమావేశంలో సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి

- ఆ దిశలో ఐఐటీలు, యూనివర్సిటీలు కీలకపాత్ర పోషించాలి
- దేశం గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా మారితేనే వికసిత భారత్ సాధ్యం
- 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం
- ఐఐటీహెచ్ స్నాతకోత్సవ వేడుకలో నీతిఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం
- 1103 మంది ఐఐటీ విద్యార్థులకు బీటెక్, ఎంటెక్ పట్టాలు ప్రదానం

స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న నీతిఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం

సంగారెడ్డి, జూలై 20(నమస్తే తెలంగాణ): భారతదేశం 2047 నాటికి 30 ట్రిలియన్ల ఎకానమీ సాధించటమే లక్ష్యమని ఈ లక్ష్య సాధనలో ఐఐటీలు, దేశంలోని యూనివర్సిటీలు కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందని నీతిఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో 13వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. 2047 నాటికి ఆమెరికాను మించి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధించాలంటే భారత్ గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు దేశంలోని ఐఐటీలు, 1200 యూనివర్సిటీలు, 4.50 కోట్ల మంది విద్యార్థులు, 15 లక్షల మంది బోధనా సిబ్బంది కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న యువ విద్యార్థులు, బోధనా సిబ్బంది కష్టపడితే వికసిత భారత్ సాధ్యపడటమే కాకుండా అందరూ కలిసి వికసిత భారతలో జీవించవచ్చని తెలిపారు. భారతదేశం రోటీ, కప్‌డా, మకాన్ నినాదం నుంచి ముందుకు వచ్చిందన్నారు. ప్రస్తుతం ఐదో అతిపెద్ద ఆర్థిక దేశంగా ఉన్న భారత్, అభివృద్ధి చెందుతున్న దేశంగా మారిందన్నారు. 2047 నాటికి 30 ట్రిలియన్ సాధించాలంటే సోషియో ఎకానమీ ట్రాన్స్‌ఫార్మరేషన్ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం భారతదేశం స్టార్టప్ క్యాపిటల్‌గా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా భారత్ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, స్పేస్‌టెక్, సెమీకండక్టర్ రంగాల్లో అగ్రస్థానానికి చేరుకోవాలని తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో భారత్‌ను అగ్రస్థానంలో నిలిపేందుకు భారత ప్రభుత్వం సెమీకండక్టర్ మిషన్, నేషనల్ మిషన్ ఆన్ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ తదితర కార్యక్రమాలు ప్రారంభించినట్లు చెప్పారు. ప్రైవేటు రంగంలో పరిశోధనలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల నిధులను కేటాయించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త పాలసీలు, ప్రోత్సాహకాలతో రాబోయే రోజుల్లో ఇండియన్ డైనమిక్ టెక్నాలజీ ఇండస్ట్రీ 350 బిలియన్ డాలర్ మార్క్ దాటుతుందని తెలిపారు. దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో మరింత పరిశోధనలు జరగాలని, ఇందుకోసం యూనివర్సిటీలు, ప్రైవేటు పరిశ్రమలు కలిసికట్టుగా పని చేయాలని కోరారు. ఐఐటీ హైదరాబాద్ అతి తక్కువ సమయంలో మంచి స్థానంలో ఉందని, ఇక్కడి నుంచి ప్రముఖ 50 స్టార్టప్ కంపెనీలు రావటం హర్షనీయమని పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో ర్యాపిడ్ యాంటీజెన్ టెస్టు కిట్లు, తక్కువ ధర పీపీఈకిట్‌లు, లోకాస్ట్ వెంటిలేటర్ల తయారీలో ఐఐటీహెచ్ కీలకభూమిక పోషించిందని కొనియాడారు.

పరిశోధనలకు పెద్దపీట: చైర్మన్ మోహన్‌రెడ్డి

ఐఐటీహెచ్ పాకలవర్గం చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ..ఐఐటీ హైదరాబాద్ మిగతా ఐఐటీలతో పోలిస్తే వేగంగా అభివృద్ధి చెందుతునట్లు చెప్పారు. ప్రధానంగా పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలపై ఎక్కువగా దృష్టి సారించినట్లు తెలిపారు. ఇక్కడి విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లించడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. 13వ స్నాతకోత్సవంలో భాగంగా 1103 మంది బీటెక్, ఎంటెక్ విద్యార్థులు పట్టాలు అందజేశారు. నలుగురు విద్యార్థులు గోల్డ్ మెడల్ అందుకోగా, 38 మంది విద్యార్థులు సిల్వర్ మెడల్ అందుకున్నారు.

ఐఐటీహెచ్‌కు ప్రథమస్థానం: డైరెక్టర్ మూర్తి

ఐఐటీ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ..రెండోతరం ఐఐటీ ర్యాంకింగ్‌లో ఐఐటీ హైదరాబాద్ మొదటి స్థానంలో ఉందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఐఐటీహెచ్‌లో మొదటిసారి బీటెక్ బయోమెడికల్ ఇంజినీరింగ్, ఎంటెక్ సెమీకండక్టర్ మెటీరియల్ అండ్ డివైజెస్, ఎంటెక్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజినీరింగ్, ఎంటెక్ హెరిటేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఐఐటీహెచ్ సెమీకండక్టర్ రంగంలో త్వరలోనే లీడర్‌గా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవలే సెమీకండక్టర్ రంగానికి సంబంధించి 620 మంది విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ప్రారంభించినట్లు తెలిపారు.

స్నాతకోత్సవానికి హాజరైన ఐఐటీహెచ్ విద్యార్థులు

చినుకు ఆగదు..వరద పారదు

వర్షపు నీటికి నోచుకోక వెలవెలబోతున్న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు

- చిరు జల్లులతోనే సరిపెడుతున్న వరుణుడు
- కారుమబ్బులు కమ్ముకున్నా భారీ వర్షానికి నోచుకోని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రాంతం

హుస్నాబాద్, జూలై 20: 'చినుకు ఆగదు... వరద పారదు'...అన్న చందంగా మారింది సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రాంత పరిస్థితి. వానకాలం ప్రారంభమై దాదాపు రెండు నెలలు గడుస్తున్నా సరైన వర్షాలు లేక కేవలం ఆరుతడి పంటలకే పరిమితమైన రైతులు ప్రధాన పంట అయిన వరి, మొక్కజొన్న సాగు చేసేందుకు జంకుతున్నారు. వరద పోయే ఒక్క వర్షం కూడా పడకపోవడమే ఇందుకు కారణం. హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి, ధూళిమిట్ట, మద్దూరు మండలాల్లోని చెరువులు, కుంటలు వర్షపు నీటికి నోచుకోలేదు. తుఫాన్ ప్రభావంతో అంతటా భారీ వర్షాలు, వరదలతో కళకళలాడుతుంటే హుస్నాబాద్ డివిజన్‌లో మాత్రం చిరు జల్లులకే పరిమితమవుతోంది. గతేడాది జూలై వరకు వరినాట్లు దాదాపు పూర్తయ్యాయి. చెరువులు, కుంటలు కూడా నిండుకుండల్లా మారాయి. ఈ ఏడాది కొద్ది మంది రైతులు మినహా మిగతా రైతులందరూ నార్లు పోసుకొని భారీ వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. గడిచిన వారం రోజులుగా నిత్యం కారు మబ్బులు కమ్ముకోవడం, చిన్నపాటి చిరుజల్లులు పడటం అనంతరం మబ్బులు కనపడకుండా పోవడం పరిపాటిగా మారింది. ఐదు రోజులుగా రోజూ చినుకులు పడుతున్నాయి తప్పా వరద పారడం లేదు. కాలం దగ్గరపడుతున్న కొద్దీ రైతన్నల్లో ఆందోళన అధికమవుతోంది. గురువారం రాత్రి 26.18మి. మీటర్ల వర్షపాతం నమోదైంది. జూలైలో మొట్టమొదటి సారి గురువారం రాత్రి మాత్ర మే ఆశాజనకంగా వర్షం కురిసింది. సాయంత్రం మొదలైన వర్షం అర్ధరాత్రి దాటే వరకు పడటంతో కొన్ని ప్రాంతాలు జలమయమయ్యాయి తప్పా వరదలుమాత్రం పారలేదు.

బెజ్జంకి మండలంలో 24.3మి.మీటర్ల వర్షం పడగా, కోహెడ మండలంలో 36.4 మి.మీటర్లు, హుస్నాబాద్ మండలంలో 23.4మి.మీటర్లు, అక్కన్నపేట మండలంలో 23.6 మి.మీటర్లు, మద్దూరు మండలంలో 20.0 మి.మీటర్లు, ధూళిమిట్ట మండలంలో 29.4 మి.మీటర్ల వర్షం పడింది. మొత్తం మీద ఒకే రోజు రాత్రి ఆరు మండలాల్లో కలిపి 26.18 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు వరకు వానముసురు ముసురు కుంది తప్పా భారీ వర్షం పడలేదు. వరుణుడు కరుణించి భారీ వర్షం పడాలని, మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ పంటలతో కళకళలాడాలని ఆశిద్దాం...

'గీతం'లో స్నాతకోత్సవ సందడి

- ఘనంగా 'గీతం' పట్టభద్రుల దినోత్సవం

పటాన్‌చెరు, జూలై 20: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శనివారం సందడిగా మారింది. సంతోషకర వాతావరణంలో 15వ పట్టభద్రుల దినోత్సవం (స్నాతకోత్సవం) వైభవంగా నిర్వహించారు. గీతం ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ వై. గౌతమరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బార్క్లేస్ బ్యాంక్ ఇండియా పూర్వ సీఈవో రామ్‌గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై పట్టాలు, పథకాలను అందజేశారు. విద్యార్థులు పట్టాలు అందుకుంటున్న సందర్భంగా గీతం ప్రాంగణం సందడిగా మారింది. ఉల్లాసభరితమైన, ఆహ్లాదకర వాతావరణంలో బార్క్లేస్ బ్యాంక్ సీఈవో రామ్‌గోపాల్ చేతుల మీదుగా విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పట్టాలు తీసుకున్నారు. ఈ మధుర క్షణాలను చూసిన తల్లిదండ్రులు చప్పట్లతో తమ పిల్లలను ప్రోత్సహించారు. అనంతరం పట్టాలతో విద్యార్థి బృందాలు చేసిన సందడి అందరినీ ఆకట్టుకున్నది. ప్రయోజకులై తమ పిల్లలు పట్టాలు పొందటంపై తల్లిదండ్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. విద్యార్థులతో కుటుంబసభ్యులు ఫొటోలు దిగి సంబుర పడ్డారు. తల్లిదండ్రుల దీవెనలతో విద్యార్థుల ముఖాల్లో సంతోషం కనిపించింది. బంగారు పతకాలు సాధించిన పట్టభద్రులు పలువురు తమకు గీతం వర్సిటీతో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అధ్యాపకుల ప్రోత్సాహం బాగుందని కొనియాడారు. కార్యక్రమంలో గీతం అధ్యాపక బృందం, సిబ్బంది, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బార్క్లేస్ బ్యాంక్ ఇండియా పూర్వ సీఈవో రామ్‌గోపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గీతంలో పట్టాలు పొందిన విద్యార్థుల సంబురాలు

ఐదుగురు ఉద్యోగుల తొలిగింపు

- 'మల్లన్న' ఆలయంలో కాంగ్రెస్ మార్క్ రాజకీయం ?
- రోడ్డున పడ్డ కుటుంబాలు

చేర్యాల, జూలై 20: కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో కాంగ్రెస్ మార్క్ రాజకీయాల కారణంగా ఐదుగురు ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన వారితో పాటు ఐదుగురు పేదలకు బీఆర్ఎస్ హయాంలో మల్లన్న ఆలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించారు. వీరు రెండున్నర ఏండ్లుగా ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా క్రమశిక్షణతో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. తీరా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వారిని బీఆర్ఎస్ సానుభూతిపరులంటూ ఉద్యోగాల నుంచి తొలిగించినట్లు తెలిసింది. కాంగ్రెస్ నాయకులు ఈవోపై ఒత్తిడి తెచ్చి ఈ ఐదుగురిని ఉద్యోగాల నుంచి తొలిగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆలయం లో విధులు నిర్వహిస్తున్న కె.విద్య(కంప్యూటర్ ఆపరేటర్), జి.కేతమ్మ(స్వీపర్), ఎం.అజయ్(లేబర్), బి.భాస్కర్(లేబర్), ఎ.నితీశ్(లేబర్) విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, వారిని విధుల నుంచి తొలిగించాలని ఆలయ ఈవో ఎ.బాలాజీ ఈనెల 13న ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ హిమాన్స్ సీఆర్ఎం సర్వీసెస్‌కు లేఖను పంపించారు. ఈవో లేఖకు స్పందించిన ఔట్‌సోర్సింగ్ సంస్థ వారిని విధుల నుంచి తొలిగిస్తున్నామని, ఈనెల 20 నుంచి ఆలయంలో విధులకు హాజరుకావద్దని, తమ ఆదేశాలను ధిక్కరించి ఆలయానికి వెళ్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సదరు సిబ్బందికి వాట్సాప్‌లో ఆర్డర్స్‌ను ఈనెల 18న పంపారు. తమను అకారణంగా తొలిగించారని, ఇది అన్యాయమని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఐదుగురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నారు. కాగా, కొమురవెల్లి మల్లన్న ఆలయంలో సిబ్బంది నియామకాల విషయంలో ఆలయ వర్గాలు ఎలాంటి విధానాలను అవలంభించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. తమకు అనుకూలురైన వ్యక్తులను, ఎలాంటి అనుభవం, విద్యార్హత లేకున్నా ఉద్యోగాల్లో నియమిస్తున్నారనే, గతంలో కొందరు పెద్దలు పలువురు వ్యక్తుల నుంచి లక్షలాది రూపాయలు తీసుకుని ఉద్యోగాల్లో నియమించారనే ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం తొలిగించిన ఐదుగురు సిబ్బంది స్థానాల్లో కొత్తగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని నియమిస్తున్నారని క్షేత్రంలో ప్రచారం జరుగుతున్నది. కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ఉద్యోగాల భర్తీ విషయంలో విధివిధానాలను తయారు చేసి విద్యార్హత, వయస్సు తదితర వాటిని దృష్టిలో పెట్టుకుని నిరుద్యోగులకు అవకాశం కల్పిస్తే వారికి ఉద్యోగంతో పాటు భద్రత ఏర్పడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆలయ ఈవో ఎ.బాలాజీని ఫోన్‌లో వివరణ కోరేందుకు యత్నించగా ఆయన స్పందించలేదు.

భారీగా గంజాయి పట్టివేత

మునిపల్లి, జూలై 20: గుట్టుచప్పుడు కాకుండా మహారాష్ట్రకు తరలిస్తున్న 115 కిలోల గంజాయి, రూ.40వేలతోపాటు ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు శనివారం ఉదయం 8గంటల సమయంలో సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ గ్రామ శివారులోని ముంబాయి జాతీయ రహదారిపై ఉన్న డెక్కన్ టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్ వైపు నుంచి జహీరాబాద్ వైపు అక్రమంగా రెండు కార్లలో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపా రు. ముంబయి జాతీయ రహదారిలోని టోల్‌ప్లాజాల వద్ద క్రమంతప్పకుండా వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పండించే గంజాయికి మంచి డిమాండ్ ఉందన్నారు. తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక, గోవాతోపాటు పలు రాష్ట్రాలకు గంజాయి అక్రమంగా తరలిస్తున్నారన్నారు. ఒడిశా, ఏపీ రాష్ట్రాల నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న నిందితులు ఏక్‌నాథ్ ఖాదర్, అంజీనాథ్‌గహీనాథ్‌బాడేలను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. ఒరిస్సాలోని పతన్‌పూర్ మున్సిపాలిటీ రాయ్‌ఘడ్ జిల్లా నుంచి గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్రకు తీసుకెళ్తున్నట్లు నిందితులు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ సీఐలు గాంధీనాయక్, వీణారెడ్డి, చంద్రశేఖర్, ఎస్సైలు అనిల్‌కుమార్, యాదయ్య, హెడ్‌కానిస్టేబుల్ అలీం, సిబ్బంది పాల్గొన్నారు.

మునిపల్లి: ఎండు గంజాయి తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం

చేగుంట, జూలై 20: మెదక్ జిల్లా చేగుంట మండలం కర్నాల్‌పల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపకుడు అంబటి ఆంజనేయులు, చైర్మన్ బచ్చు రమేశ్‌గుప్తా, మాజీ చైర్మన్ తుమ్మ యాదగిరి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వారికి మహాభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు, తీర్థప్రసాద వితరణ, మహా హారతి, అన్నదానం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కర్నాల్‌పల్లి సాయిబాబా ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న భక్తులు